క్లుప్తంగా

మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం తక్షణమే మద్యపాన నిషేధం అమలు చేయాలని పీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ జీవన్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చదువుకునే వయసులో విద్యార్థులు మద్యపానానికి అలవాటై వ్యసనంగా మారి వారి భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానం నిషేధంపై రాష్ట్రవ్యాప్తంగా పీఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

ఫీల్డ్ టెక్నీషియన్ - ఎయిర్ కండిషనర్ కోర్సులో శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు షార్ట్ టర్మ్ కోర్స్ కింద ఫీల్డ్ టెక్నీషియన్ - ఎయిర్ కండిషనర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి ఆపైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 15వ తేదీలోగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డీఎల్‌టీసీ కార్యాలయానికి పంపాలని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94934 82414లో సంప్రదించాలని తెలిపారు.

ప్రివోస్ట్ నియామకం ప్రపంచ శాంతికి మార్గం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నూతన పోప్‌గా అమెరికాకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ నియామకంతో ప్రపంచ శాంతికి మార్గం సుగమమైందని యాంటీనోరీ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 140 కోట్ల మంది క్యాథలిక్‌లకు మత గురువుగా 267వ పోప్‌గా ప్రివోస్ట్ బాధ్యతలు చేపట్టనుండడం శుభపరిణామమని తెలిపారు. వివిధ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని నివారించడానికి పోప్ కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. మనుషులందరినీ కలిపవే వారధులు నిర్మిద్దామని ఆయన పిలుపునివ్వడం ప్రపంచ శాంతికి ఆయన ఎంతగా తపిస్తున్నారో స్పష్టం చేస్తోందని వివరించారు.

20న సమ్మెను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల్లోని 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను కొత్తగా చేర్చడం ద్వారా కార్మిక హక్కులను హరించివేస్తోందని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ ఆగోల్ల వెంకటకృష్ణారావులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విడనాడాలని డిమాండ్ చేశారు. మే 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా జిల్లాలోని చేతి వృత్తిదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తమ్మిలేరును కాటేస్తున్న కాలుష్యం

- పర్యావరణానికి పెను ముప్పు
- నిర్వహణ లోపం.. పేరుకుపోతున్న వ్యర్థాలు
- వేసవి ముగింపు దశకు వచ్చినా ప్రారంభం కాని ప్రక్షాళన
- దుర్గంధంతో తమ్మిలేరు పరిసర ప్రాంతాల ప్రజల ఇబ్బందులు



బాలయోగి వంతెన సమీపంలో వ్యర్థాలతో నిండిన తమ్మిలేరు



తంగెళ్లమూడి వద్ద తమ్మిలేరులో అల్లుకుపోయిన గుర్రపు డెక్క



ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని పడమర లాకుల వద్ద ఇలా..



అశోక్‌నగర్ వద్ద గుర్రపు డెక్కతో నిండిన తమ్మిలేరు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరానికి ఇటు పడమర, అటు తూర్పువైపు తమ్మిలేరు విస్తరించి ఉంది. నిర్వహణ లోపం కారణంగా తమ్మిలేరులో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క, తూడు, చెత్త పేరుకు పోయాయి. నగర ప్రజలు వేస్తోన్న అన్నిరకాల వ్యర్థాలతో పాటు జంతు కళేబరాలు తమ్మిలేరులో దర్శనమిస్తున్నాయి. దీంతో దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లి ఏటిగట్టు ప్రాంతంలో నివాసించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తక్షణం తమ్మిలేరు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ఏలూరు నగర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రెండు పాయలుగా తమ్మిలేరు ప్రవాహం

చింతలపూడి మండలంనాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు వద్ద నుంచి ప్రారంభమైన తమ్మిలేరు ఏలూరు వద్దకు వచ్చేసరికి ఏలూరు - చింతలపూడి మార్గంలోని ఎఫ్‌సీఐ గొడౌన్స్ వద్ద నుంచి తమ్మిలేరు రెండు పాయలుగా చీలుతుంది. ఒక పాయ తూర్పు వైపు నుంచి తంగెళ్లమూడి, ఏటిగట్టు, మార్కెట్ యార్డు రోడ్డు, రైల్వే ట్రాక్ దాటుకుని తూర్పు లాకుల వద్ద కొల్లేరులో కలుస్తుంది. మరో పాయ అశోక్ నగర్, అమీనాపేట, గ్జేవియర్ నగర్ మీదుగా ఏలూరు నగరం మధ్య నుంచి కొత్త బస్టాండ్‌కు సమీపంలోని వంతెన దిగువగా ప్రవహించి పడమర లాకుల వద్ద నుంచి కొల్లేరులోకి ప్రవేశిస్తుంది.

వేసవి, సీతాకాలాల్లో దుర్గంధం

వర్షాకాలం నీరు దిగువకు ప్రవహిస్తుండటంతో ప్రజలకు పెద్దగా ఇబ్బంది ఉండదు. పెద్ద ఎత్తున వరద నీరు వస్తున్న సమయంలో తమ్మిలేరులోని అన్ని వ్యర్థాలూ నీటి ప్రవాహంతో పాటు కొల్లేరులోకి వెళుతుంటాయి. వర్షాకాలం అనంతరం తూర్పు, పడమర లాకులను పూర్తిగా మూసివేస్తారు. వ్యర్థాలు ఎక్కడివక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లి ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

వైఎస్సార్ సీపీ హయాంలో వరద నివారణ

తమ్మిలేరు వరదలకు ఏటా ఏలూరు నగరంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగి ప్రజలు నానా అవస్థలు పడుతుంటారు. దీంతో వైఎస్సార్ సీపీ హయాంలో తమ్మిలేరు వరద నివారణ చర్యలు చేపట్టింది. తమ్మిలేరుకు పలు చోట్ల రూ.140 కోట్లు వరకు వెచ్చించి రివిట్‌మెంట్‌లు నిర్మించింది. దీంతో నగర వాసులకు వరద ముప్పు తప్పింది. ఇక చేయాల్సిందల్లా ఏటా సాధారణ నిర్వహణ మాత్రమే. దీన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తమ్మిలేరు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. తమ్మిలేరులో నీటి ప్రవాహానికి అన్ని రకాల వ్యర్థాలూ ఆటంకంగా మారాయి. కాలుష్య నివారణకు నగరపాలక సంస్థ ప్రజలకు నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు దృష్టి సారించడంలేదనే విమర్శలు ఉన్నాయి.

దుర్గంధం నుంచి కాపాడాలి



తమ్మిలేరు దుర్గంధం నుంచి ఏలూరు నగర వాసులను కాపాడాలి. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు హడావుడిగా అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ హామీలు ఇవ్వడం మినహా ఒరగబెట్టేది ఏమీ లేదు. ఏటా తమ్మిలేరును శుభ్రం చేయించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. దీంతో సమస్య చాలా వరకు తగ్గుతుంది.

– పి.ఆదిశేషు, ఏటిగట్టు నివాసి, ఏలూరు వన్‌టౌన్

ప్రక్షాళన చేయాలి



తమ్మిలేరును యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేయాలి. క్రమం తప్పకుండా ఏటా యేటా తమ్మిలేరులో పూడిక తీయించాలి. దీంతో వర్షా కాలంలో అధికంగా వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గం వీలవుతుంది. వరద వచ్చినప్పుడు హడావుడి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిది.

– బండి వెంకటేశ్వరరావు, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏలూరు

మోసగించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రేమ పేరుతో విద్యార్థినిని మోసం చేసిన గద్దం సంతోష్ కుమార్‌ను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఆత్మహత్య ప్రయత్నం చేసి ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని నాని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లదిబ్బ ప్రాంతానికి చెందిన సంతోష్‌కుమార్ అనే యువకుడు అదే ప్రాంతంలో ఉంటున్న డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో లొంగదీసుకుని ఐదేళ్లుగా ప్రేమ వ్యవహారం నడిపి పెళ్లికి నిరాకరించాడన్నారు. తాను మోసపోయానని గ్రహించి మనస్థాపానికి గురై చీమల మందు తాగిన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



అవార్డు అందుకుంటున్న లక్ష్మీ నరసింహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులను భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఆయా పాఠశాలలో ఉచితంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి శిక్షణ అందించనున్నట్టు ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల క్లబ్ వర్క్ షాప్‌లో ఏలూరుకు చెందిన లక్ష్మీనరసింహం ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు మంచి మార్కులతో పాటు ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఒత్తిడికి దూరంగా ఉండే విధంగా నివారణ ఉపాయాలు తమ వర్క్‌షాప్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. నాగేశ్వరరావు చేతుల మీదుగా లక్ష్మీ నరసింహంకు అవార్డు అందజేశారు.

నేటి నుంచి ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు



మాట్లాడుతున్న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వర్ధమాన కవులు, కళాకారులు, రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నామని శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ప్రతాప్ మాట్లాడారు. శ్రీ శ్రీ కళావేదిక నిరంతర సాహితీ క్రతువులో భాగంగా మే నెల 10, 11 తేదీల్లో స్థానిక మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో ప్రపంచ స్థాయిలో తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రపంచ కవితోత్సవం, తెలుగు సాహిత్య సదస్సు, చర్చా గోష్ఠి, రంగస్థల ప్రదర్శనలు, వివిధ రకాల సాంప్రదాయ కళా ప్రదర్శనలు, జానపదం, కూచిపూడి, భరతనాట్యం తదితర సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారని తెలిపారు. 2000 మంది కవులు, రచయితలు, కళాకారులు పాల్గొనే ఈ కార్యక్రమం సాహిత్య చారిత్రాత్మక ఘట్టమన్నారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో వరుసగా శ్రీ శ్రీ కళావేదిక చేస్తున్న నాలుగవ వరల్డ్ రికార్డు కార్యక్రమంగా నిలుస్తుందన్నారు. ఇప్పటి వరకు 147 జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు, సాహిత్య సదస్సులు, కళారంగ ప్రదర్శనలు నిర్వహించామని వివరించారు. సమావేశంలో జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జీ. ఈశ్వరీ భూషణం, ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి, సుజయ్ కృష్ణ, గురు శర్మ, లేళ్ల వెంకటేశ్వరరావు, ఐజాక్, తదితరులు పాల్గొన్నారు.

10లోగా దరఖాస్తు చేసుకోవాలి



నాయకులతో సమావేశం నిర్వహించిన ముక్కంటి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్యాచరణ ప్రణాళికలో ఓబీఎంఎస్ పోర్టల్‌లో లబ్ధిదారులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం ముక్కంటి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓబీఎంఎస్ పోర్టల్‌లో కొన్ని పథకాలకు దరఖాస్తులు లక్ష్యం మేరకు నమోదు కాలేదని ముక్కంటి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను వివరించారు.

తూనికలు, కొలతలపై అవగాహన



మాట్లాడుతున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూనికలు, కొలతల వినియోగం, రైతు బజార్, చికెన్, మటన్, కిరాణా దుకాణాల్లో వివిధ వ్యాపారులు చేసే మోసాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక డీ మార్ట్ వ్యాపార సంస్థలో శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వస్తువు ఎంఆర్‌పీ ధర కంటే ఎవరూ ఎక్కువ ధరకు అమ్మకూడదని అన్నారు. ప్యాకేజీలపై తయారీదారుని పేరు, వస్తువు పేరు, నికర బరువు, తయారు చేసిన తేదీ, గరిష్ట చిల్లర ధర, వినియోగదారులు చేసే ఫిర్యాదుల కోసం ఉండాల్సిన సెల్ ఫోన్ నెంబర్, ఇ మెయిల్ తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమములో తూనికలు, కొలతల శాఖ ఉప నియంత్రకులు హరి ప్రసాద్, సహాయ నియంత్రకులు సాయి రామ్, భీమవరం సహాయ నియంత్రకులు వీవీ నాగ రాజా రావు, పరిశీలకులు ప్రశాంత్, న్యాయవాది కట్టా సత్యనారాయణ ఏలూరు జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎం జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

కన్న బిడ్డల్లా చూసుకోవాలి



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): హాస్టల్‌లో పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకొని, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు సూచించారు. శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. పిల్లలకు సంరక్షణ, వైద్యం, విద్య, శిక్షణ అభివృద్ధి, పునరావాసం కోసం ఈ గృహాన్ని ఏర్పాటు చేశారని రత్నప్రసాదు తెలిపారు. ప్రతినెలా ఈ వసతి గృహాన్ని సందర్శించి బాలలకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై విచారించాల్సి ఉందని చెప్పారు. అందులో భాగంగా శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించామని, అబ్జర్వేషన్ హోమ్‌లో ఉన్న బాలలకు అనగా చట్టంతో విభేదించిన బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, వసతులపై అడిగి తెలుసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీరకాయలు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	38	బీట్‌రూట్	34
బీరకాయలు	30	కీరా దోస	38
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	20	అల్లం	56
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	22	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	38

రజక సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీగా గోపిరాజు



బుద్ధవరపు గోపిరాజుకు నియామక పత్రం అందిస్తున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జనసంఘం జాయింట్ సెక్రటరీగా బుద్ధవరపు గోపిరాజును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య శుక్రవారం స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. అనేక చోట్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీలు తీర్మానాలు ఇవ్వకపోవడం, రజక వృత్తి చెరువులను నిబంధనలకు వ్యతిరేకంగా లీజుకు ఇవ్వడం వల్ల వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలోని రజకుల సమస్యల పరిష్కారానికి వీలుగా నూజివీడు ప్రాంతానికి చెందిన గోపిరాజును ఎంపిక చేశామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలి



మోరు రామరాజు

దెందులూరు: స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీ కులాల ఏ, బీ, సీ, డీ రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు వైఎస్సార్ సీపీ కొల్లేరు సీనియర్ నేత మోరు రామరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీసీలు రాజ్యాంగ శక్తులుగా అభివృద్ధి చెందేందుకు ఐక్యతతో కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో బీసీలను రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ఎంత ప్రాధాన్యత ఇచ్చారో ఆలోచించాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ అమలులో లోపాలను సరిచేయాలని, బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, రాజకీయాల్లో బీసీలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక బీసీ సామాజిక భవనాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరారు.

జాబ్ మేళాలో 21 మంది ఎంపిక



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఏలూరు (టూటౌన్): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు 85 మంది అభ్యర్థులు హాజరుకాగా, 21 మంది ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. జిల్లా నేషనల్ కెరీర్ సర్వీస్ కోఆర్డినేటర్ జి.ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాల పరంగా ముందంజలో ఉండాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని యువతకు సూచించారు. ఈ మేళాలో శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఇండియా, అపోలో టైర్స్ లిమిటెడ్, వేరియంట్ ప్రైమరీ స్కూల్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది జి.ప్రవీణ్ శ్రీవత్సవ, ఎస్ పావని, నాగవల్లి, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	16
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	10

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	06
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్త దాతకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ

చింతలపూడి : అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఉత్తమమైందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ కోరారు. స్థానిక ఎం కన్వెషన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. రక్తం దానం చేసి వారి ప్రాణాలను కాపాడాలన్నారు. తలసేమియ వ్యాధిగ్రస్తులకు ప్రతి రోజూ రక్తం అందించి, వారి ప్రాణాలను నిలబెట్టాల్సి వస్తుందని తెలిపారు. శిబిరంలో రక్తదానం చేసిన దాతలను ఎస్పీ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

సైనికులకు వాకర్స్ సంఘీభావం



జెండా పట్టుకుని జేజేలు పలుకుతున్న వాకర్స్

ఏలూరు రూరల్ : పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తోన్న మన సైనికులకు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జేజేలు పలికారు. శుక్రవారం ఉదయం అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, అధ్యక్షుడు పి.నాగవిఘ్నేశ్వరరావు, మేరీ మాణిక్యం తదితరులు జాతీయ జెండా చేతబట్టి స్టేడియంలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదులపై దాడి చేసి తుద ముట్టించిన సైనికుల ధైర్యాన్ని కొనియాడారు. ప్రజలంతా సైన్యానికి మద్దతుగా నిలవాలని కోరారు.

మురళీ నాయక్‌కు నివాళి

ఏలూరు (టూటౌన్): దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీనాయక్ అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. భారత నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం భారత పోస్టులపై కాల్పులతో విరుచుకుపడిన నేపథ్యంలో వారితో వీరోచితంగా పోరాడిన రాష్ట్రానికి చెందిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ తీవ్ర బుల్లెట్ గాయాలతో యుద్ధ రంగంలోనే వీరమరణం పొందారని తెలిపారు. మురళికి ఘనంగా నివాళులర్పించారు. మురళి నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.